క్లుప్తంగా

గొంగడికి తగ్గని ఆదరణ



గొంగళ్లను అమ్ముతున్న వ్యాపారులు

వికారాబాద్ అర్బన్: కొన్ని రోజులుగా చలి తీవ్రత పెరగడంతో గొంగళ్లకు డిమాండ్ పెరిగింది. పాతకాలం నుంచి గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా గొంగళిని వాడుతారు. చలికి వెచ్చదనం పొందేందుకు నేడు మార్కెట్‌లోకి అనేక రకాల దుప్పట్లు, స్వెటర్లు వచ్చినా గ్రామీణ ప్రజలు ఇంకా గొంగలికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆదివారం వికారాబాద్‌లో జరిగే సంతలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు గొంగళ్లను పెద్ద ఎత్తున అమ్ముతున్నారు. గత నెల రోజులుగా వ్యాపారం జోరు సాగుతోందని తెలిపారు.

కులాంతర వివాహ జంటకు చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

యాలాల: కులాంతర వివాహం చేసుకున్న ఓ జంటకు రూ.3లక్షల చెక్కును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదివారం అందజేశారు. తాండూరు పట్టణానికి చెందిన రమాదేవి, శివకృష్ణలు కులాంతర వివాహం చేసుకున్నారు. ఈ జంటకు ప్రభుత్వం ప్రోత్సాహంలో భాగంగా రూ.3లక్షల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం తదితరులు ఉన్నారు.

గడ్డివాము దగ్ధం



కాలిపోతున్న గడ్డి


కుల్కచర్ల: అకస్మత్తుగా గడ్డివాము దగ్ధమైన ఘటన మండల పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన కాకి బిచ్చయ్య పొలంలోని రెండు గడ్డివాములు ఆదివారం మధ్యాహ్న సమయంలో అకస్మత్తుగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ, మంటలు అదుపుకాక గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రయోజనం లేకపోవడంతో సుమారు రూ.30వేల ఆర్థికనష్టం రిగిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ఘనంగా ఊరేగింపు



అనంతగిరి: వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేటలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి మాలధారులు హనుమాన్, రాముడు తదితర వేషాధారణలో గ్రామవీధుల్లో నృత్యాల చేస్తూ ఊరేగింపు చేశారు. అనంతరం అయ్యప్పకు ప్రత్యేక పూజలు, హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం



ముస్తాబైన ఆలయం

కుల్కచర్ల: నేడు (సోమవారం) గురులోకమసంద్ ఆలయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ బద్రునాయక్, కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చాంద్రలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఎర్రగోవింద్ తండా గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన గురులోకమసంద్ ప్రభుఆలయ 14వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

మళ్లీ గల్లీకో 'బెల్టు'

- నిబంధనలుకు విరుద్ధంగా బెల్టు షాపులు
- పేరుకే కిరాణ దుకాణం.. అమ్మేది మాత్రం మద్యం
- కట్టడి చేయాలని స్థానికుల మొర



బెల్టు దుకాణాల్లో పట్టుకున్న మద్యం (ఫైల్)

పెద్దేముల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు బెల్టు దుకాణాలను కట్టడి చేయడంతో పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి. ఎన్నికలు పూర్తవడంతో మళ్లీ గల్లీకో బెల్టు షాపుతో గ్లాసులు గళగళలాడుతున్నాయి. పెద్దేముల్ మండలంలో 37 గ్రామ పంచాయతీలు, ఎనిమిది అనుబంధ గ్రామాలున్నాయి. ప్రభుత్వం పెద్దేముల్, తట్టెపల్లి గ్రామాలకు మద్యం దుకాణాలను మంజూరు చేసింది. అలాగే మద్యం ప్రియులకు పర్మిట్ రూంలను కూడా ఏర్పాటు చేసింది. అయితే, మద్యం ప్రియులు అక్కడే మద్యం సేవించాలి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు పెట్టరాదు. కానీ, మండలంలో బెల్టు దుకాణాలు గల్లీకొకటి వెలిశాయి. పల్లెలో సమయానికి తాగునీరు లభించకపోయినా మద్యం మాత్రం అందుబాటుల్లో ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. బెల్టు షాపులు ఎక్కువగా ఉండడంతో రాత్రి వేళల్లో గొడవలు జరిగి ఇతరులకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కల్లు దుకాణాలు కూడా పెరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామానికోక కల్లు దుకాణానికి పర్మిషన్ ఉంది. కానీ, పలు గ్రామాల్లో రెండు కల్లు దుకాణాలు కూడా ఉన్నాయి. కల్లు దుకాణాలు ఇష్టం వచ్చిన ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. దీంతో పల్లెలు, మారుమూల గ్రామాలు మత్తులో జోగుతున్నాయి. దానికి తోడు తెలంగాణ నుంచి కర్ణాటక రాష్ట్రానికి కూడా కల్లు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేగాక సారా విక్రయాలు కూడా జరుగుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇంతా జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇంతకు పెద్దేముల్ ఎక్సైజ్ ఎస్ఐ ఎవరు?.. ఎక్కడా ఉంటారు కూడా తెలియని పరిస్థితి ఉందని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయాలు..

మండలంలో బెల్టు దుకాణాల యజమానులు ఇష్టం వచ్చిన ధరలకు మద్యం విక్రయిస్తున్నా పట్టించుకోనే నాథుడే కరువయ్యారు. ఓ బీరు సీసాపై అదనంగా సుమారు రూ.20 నుంచి రూ.30, బ్రాందీ బాటిళ్లపై రూ.20 నుంచి రూ.40 వరకు విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదేమని అడిగితే నెలనెల ఇవ్వాల్సిన ఖర్చులు కూడా ఉన్నాయని చెబుతున్నారు. వైన్స్ షాపుల్లో లేని బ్రాందీ బెల్టుషాపుల్లో ఉండటం గమనార్హం. ఎన్నికల సమయంలో పోలీస్, ఎక్సైజ్ అధికారులు బెల్టు దుకాణాలను ఏవిధంగా కట్టడి చేశారో అలాగే కొనసాగితే పల్లెలు ఎంతో బాగుంటాయని మహిళలు, విద్యార్థులు అంటున్నారు. పల్లెలో మద్యం విక్రయాలు చేయడం వల్ల యువత మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయికి..

సైకాలజిస్ట్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత అశోక్

యాలాల: విద్యతోనే ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని సైకాలజిస్ట్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల అశోక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో 10వ తరగతి విద్యార్థినులకు మూడు నెలల 'ప్రేరణ కార్యక్రమం' ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రేరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకు ఫోన్ 9989310141 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కవయిత్రి మొల్ల కళావేదిక వ్యవస్థాపకుడు వెంకట్ మాట్లాడుతూ.. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ మంగమ్మ, సీఆర్‌టీ మాధవి, స్వాతి తదితరులు ఉన్నారు.



యాలాల: కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక్

కొడంగల్‌ను ఒక్కటిగా చేయాలి

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గాన్ని ఒక్కటిగా మార్చి ఒకే జిల్లాలో ఉంచాలని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో దివంగత మాజీ ఎంపీ డాక్టర్ మల్లికార్జున్ 21వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహబూబ్‌నగర్ ఎంపీగా మల్లికార్జున్ రైల్వేశాఖ సహాయ మంత్రిగా ఉన్న సమయంలో కొడంగల్ నియోజకవర్గానికి రైల్వే లైన్ కోసం సర్వే చేయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్న టీఆర్ఎస్‌కు చెందిన మన్నె శ్రీనివాస్‌రెడ్డిని తాను ఒక్కసారి కూడా చూడలేదన్నారు. ఆయన గెలిచిన తర్వాత కొడంగల్‌కు ఒక్కసారి కూడా రాలేదని విమర్శించారు. ఎంపీ అంటే మల్లికార్జున్ లాగా చిరస్థాయిగా నిలిచేలా పని చేయాలని హితవు పలికారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం కొడంగల్‌ను రెండు ముక్కలుగా చేసి కుక్కలు చింపిన విస్తరిలా మార్చారని మండిపడ్డారు. రెండు మండలాలు నారాయణపేట జిల్లాలో మూడు మండలాలు వికారాబాద్ జిల్లాలో కలిపి కొడంగల్‌ను అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరా రు. నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కొడంగల్ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఫేషియల్ అటెండెన్స్‌తో ఇక్కట్లు

విద్యా బోధనకు ఆటంకం



ఫేషియల్ అటెండెన్స్ తీసుకుంటున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

దౌల్తాబాద్: రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాల్లో నూతనంగా ప్రవేశపెట్టిన విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్‌తో ఉపాధ్యాయులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. పాఠశాలలకు ప్రతి రోజు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్యను కచ్చితంగా తెలుసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఉపాధ్యాయులు తరగతుల వారీగా డీఎస్సీ–ఎఫ్ఆర్ఎస్ అనే యాప్ ద్వారా విద్యార్థుల ముఖచిత్రాలను ముందుగానే సేకరించడం జరిగింది. ఇక ప్రతి రోజు పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులను తరగతుల వారీగా ఉదయం యాప్‌లో ముఖచిత్రాలను సెల్‌ఫోన్ ద్వారా వెరిఫై చేసి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కాగా, ఈ ముఖ చిత్రాలను వెరిఫై చేసే క్రమంలో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సరిగా ఉండకపోవడం, వారి ముఖ చిత్రాలు వెరిఫై కావడంలో ఆలస్యమవుతుంది. దీంతో గంటన్నర వరకు సమయం వృథా అవుతోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఓ పక్క ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుల బోధనకు తోడు ఉన్నతి కార్యక్రమం, ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం అమలు రికార్డులు రాయడం వంటి విధానాలను విద్యాశాఖ చేపడుతుండడంతో ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరుగుతుంది. కాగా, నూతనంగా చేపట్టిన ఫేషియల్ విధానంతో సమయం వృథా అవడం విద్యాబోధనకు ఆటంకం కలగడం తప్ప పెద్దగా ప్రయోజనం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

పంటల రక్షణకు పాట్లు



తిర్మాలాపూర్‌లో పంట రక్షణ కోసం కట్టిన చీరలు

- పంటలను ధ్వంసం చేస్తున్న పందులు
- రక్షణ కోసం చీరలు కడుతున్న రైతులు
- పొలాల వద్ద జాగరణ

దౌల్తాబాద్: మండలంలోని రైతులు వేసిన పంటలను కాపాడుకోడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. యాసంగి పంటలు వేసిన నాటి నుంచి రాత్రి పగలు పొలాల రైతులు వద్దనే నిరీక్షిస్తున్నారు. అడవిపందులు ఎక్కువ కావడంతో చేతికి వచ్చిన పంట నాశనం అవుతోందని వారు ఆందోళన చెందుతున్నారు. గత ఖరీఫ్ వాతావరణం అనుకూలించక తుపాను కారణంగా వచ్చిన నష్టాన్ని యాసంగితో భర్తీ చేసుకుందామని రైతులు ఎక్కువగా రబీ పంటలను వేశారు. పంటలు వేసిన నాటి నుంచి పందుల బెడద అధికమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని తిర్మాలాపూర్, అంతారం, దౌల్తాబాద్, నందారం, కుదురుమళ్ళ, నీటూరు, నర్సాపూర్ తదితర గ్రామాల్లో ఆరుతడి పంటలైనా జొన్న, మొక్కజొన్న, చిక్కుడు, టమాట, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నారు. ఈ పంటలను రక్షించుకోవడానికి రైతులు పంటల చుట్టూ రంగురంగుల చీరలను, వైర్లు, పలురంగుల జెండాలు, చెట్లకు ఖాళీ సీసాలు కట్టి అందులో రాళ్ళు వేస్తున్నారు. అంతేకాకుండా రాత్రి వేళలో పంటపొలాల వద్ద టపాకాయలు కాల్చడం చేస్తున్నారు. అయినా అడవి పందులు గుంపులుగా పంటలపై పడుతూ నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. అడవి పందులను నివారించి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పంటల చుట్టూ చీరలే..

మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు పంటల చుట్టూ చీరలు కట్టారు. ఈ చీరలను హైదరాబాద్ నుంచి చీరకు రూ. 30 నుంచి రూ.40 చెల్లించి కొనుగోలు చేస్తున్నామని రైతులు తెలిపారు.

ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడిగా మధుసూదన్



నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులు

పరిగి: పరిగి పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా మధుసూదన్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా వేముల కిరణ్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆర్యవైశ్యుల హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేస్తామన్నారు. నిరంతరం సంఘ సభ్యులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎవ్వరికి ఏ సమస్యలు ఉన్న వెంటనే సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆర్యవైశ్యులను ఏకతాటిపై తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ అభివృద్ధికి శ్రీకారం

మినీ స్టేడియం నిర్మాణానికి ఏర్పాట్లు



కొడంగల్ హైస్కూల్ వద్ద ఆడుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

కొడంగల్ : సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గతంలో కొడంగల్‌కు మంజూరై పనులు ప్రారంభం కాని మినీ స్టేడియం నిర్మాణంపై అధికారులు దృష్టి సారించారు. స్టేడియం నిర్మాణానికి ఐదెకరాల స్థలం లభించకపోవడంతో నిర్మాణం ప్రారంభం కాలేదు. పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని ముందుగా అనుకున్నారు. అయితే, అక్కడ నాలుగున్నర ఎకరాల భూమి మాత్రమే అందుబాటులో ఉండడంతో దాన్ని పక్కన పెట్టారు. సిద్దనొంపు దగ్గర ఉన్న ప్రభుత్వ స్థలం అనువుగా ఉండడంతో అక్కడ నిర్మించాలని భావించారు. కొడంగల్‌కు దూరం అవుతుందనే కారణంతో అక్కడ కూడా నిర్మించడానికి అంగీకరించలేదు. క్రీడా మైదానం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.10కోట్లు నిరుపయోగంగా మారాయి. క్రీడాకారుల ఆశలు నెరవేరలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ కొడంగల్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గతంలో ఆగిపోయిన పనులను ప్రారంభించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

మనోహర్‌రెడ్డికి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న స్థానిక నేతలు

కుల్కచర్ల: మండలానికి చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం ఎంతో సంతోషకరమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తాండురు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల్కచర్ల మండలానికి చెందిన మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యే కావడం మండలవాసులుగా తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని అలాగే, మండల ప్రజల అభ్యున్నతికి సైతం సహకరించాలని కోరారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడికెళ్లినా కుల్కచర్ల ప్రజలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చాంద్ర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ 2 అధ్యక్షుడు కర్రె భరత్ కుమార్, మొగులయ్య, నాయకులు కుమ్మరిస్వామి, కృష్ణయ్య పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన విశ్వనాథ్‌గౌడ్



ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్వనాథ్‌గౌడ్

తాండూరు: తాండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ ఆదివారం శాసన సభాపతి ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు పుష్పగుచ్ఛ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్ జిల్లా అభివృద్ధి విషయంలో ప్రత్యేక చొరవ చూపించాలని కోరారు.

క్రిస్మస్ వేడుకలకు సిద్ధం



మోమిన్‌పేట: క్రిస్మస్ విశిష్టతను తెలియజేసే అలంకరణ

పెద్దేముల్: నేడు(సోమవారం)జరగనున్న క్రిస్మస్ వేడుకలకు చర్చిలు రంగు రంగుల లైట్లతో ముస్తాబయ్యాయి. మండలంలోని పెద్దేముల్, నాగులపల్లి, మంబాపూర్, మారేపల్లి, గాజీపూర్, ఇందూరు, అడ్కి చర్ల, తట్టెపల్లి, మంబాపూర్, రుక్మాపూర్, కొండాపూర్‌గ్రామాల్లో చర్చీలు ప్రార్థనలకు సిద్ధమయ్యాయి. ఆదివారం రాత్రి నుంచే పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణాలు, వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు గ్రామాలకు చేరుకున్నారు.

ఇంటింటా క్రిస్మస్ సందడి

మోమిన్‌పేట: మండలంలోని ఆయా గ్రామాల్లో క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రిస్టియన్ సోదరుల ఇంటింటా పండుగ శోభ కనిపిస్తోంది. ఇల్లంతా అందంగా తీర్చిదిద్దుకొని, విద్యుత్ దీపాలతో వెలుగులు, క్రిస్మస్ పండుగను తెలియజేసే అలంకరణ, మరికొంత మంది హ్యాపీ క్రిస్మస్ బెలూన్‌లను ఎగురవేశారు.

సర్వమతాలు సమానం

బొంరాస్‌పేట: సర్వమతాలు సమానమేనని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని మెట్లకుంట, తుంకిమెట్ల, బొంరాస్‌పేట గ్రామాల్లోని చర్చిల్లో స్థానిక క్రైస్తవ కుటుంబాలకు ఉచితంగా ప్రభుత్వం అందించే దుస్తులను పంపిణీ చేశారు. ఆరాధన కార్యక్రమం అనంతరం దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాములుగౌడ్, నర్సింలుగౌడ్, రాజేశ్‌రెడ్డి, నర్సింలు నాయుడు, మల్లేశ్ తదితరులున్నారు.





బొంరాస్‌పేట: క్రైస్తవులకు దుస్తులు అందజేస్తున్న నాయకులు

పెరుగుతున్న చలి

ఉదయం 9 దాటినా తగ్గని పొగ మంచు



బెన్నూరు సమీపంలోని మలుపు వద్ద మంచు ప్రభావం

యాలాల: చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. కురుస్తున్న మంచు ధాటికి ఆదివారం ఉదయం 9 గంటల వరకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లక్ష్మీనారాయణపూర్ నుంచి యాలాల మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో భారీగా మంచు ఉండటంతో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కొందరు వాహనదారులు తమ వాహనాలకు లైట్లు వేసుకొని నిదానంగా వెళ్లారు. ముఖ్యంగా బెన్నూరు నర్సరీ సమీపంలో భారీ మూల మలుపులు ఉండటంతో వాహనదారులకు మరింత ఇబ్బంది కలిగింది.